

మెరుగుపడిన పారిశుధ్యం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-విజయపురం (నగరి): నగరి రూరల్ మండలం తెరని హెల్త్ సెంటర్‌లో గురువారం అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. గురువారం ప్రజాశక్తి పత్రికలో 'హెల్త్ సెంటర్ అనారోగ్యం' అనే శీర్షికన వార్త ప్రచురణ చేయడం జరిగింది. దీన్నిపై స్పందించిన అధికారులు హెల్త్ సెంటర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, పారిశుధ్య పనులు చేపట్టారు.



హెల్త్ సెంటర్‌లో పారిశుధ్యపనులు చేపట్టిన అధికారులు

ఎడతెరిపి లేని వాన

- జిల్లాపై తుపాను ప్రభావం
- మరో రెండు రోజులు వర్షాలు
- కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

తుపాను ప్రభావంతో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా గురువారం ఉదయం నుండీ ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. రాయలసీమ జిల్లాలో శని, ఆదివారాల్లో కూడా ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాకు ఉద్యానవన పంటలు, వరి దెబ్బతినే అవకాశమున్నట్లు ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత వారం ఫెంగల్ తుపాను కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల ఉద్యానవన పంట దెబ్బతిన్నాయి. నవంబర్ 31 తేది నుండీ డిసెంబర్ మూడో తేదీ వరకు తుపాను ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు పడ్డాయి. జలాశయాలు వర్షపు నీటితో నిండి జలకళ సంతరించుకున్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అధికార యంత్రాగం అప్రమత్తమైంది. తుపాను నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు సెలువు ప్రకటించింది. వ్యవసాయ, ఉద్యానవన, జలవనరులు, ట్రాన్స్‌కోశాఖలను అప్రమత్తం చేయడంతో పాటు తహశీల్దార్లు, ఎంపిడిఒలను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అప్రమత్తం చేశారు. ప్రాణ, పంట నష్టం చోటు చేసుకోకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వర్షపాతం వివరాలు ఇలా..

జిల్లాలో అత్యధికంగా విజయపురం 40.8 మిలీమీటర్లు నమోదు కాగా 11 మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలోని 32 మండలాల్లో ఎక్సెజ్ వర్షపాతం పులిచర్ల, పూతలపట్టు, తవనంపల్లి, సోమల, పుంగనూర్, పలమనేరు, ఐరాల, సోమల మండలాల్లో నమోదు అయ్యింది. అక్టోబర్ మాసంలో 214.1, నవంబర్ మాసంలో 44.9, డిసెంబర్ మాసంలో 143.3 మీలీమీటర్ల వర్షపాతం నమోదయింది. డిసెంబర్ మొదటి వారం ఫెంగాల్ తుపాను, ప్రస్తుత తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

జిల్లా కలెక్టరేట్ లోకంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 94910 77356, ల్యాండ్ లైన్: 08572-242777 అలాగే చిత్తూరు ఆర్‌డిఓ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెం:94910 77011, కుప్పం ఆర్‌డిఓ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెం:99660 72234, పలమనేరు ఆర్‌డిఓ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెం: 94910 74510, నగరి ఆర్‌డిఓ కార్యాలయం కంట్రోల్ రూమ్ నెం: 96521 38325

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

విజయపురం: తుపాన్ ప్రభావంతో గురువారం వేకువజాము నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూ ఉండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. కాలువల ద్వారా చెరువులకు నీరు చేరుతోంది. కుశస్థలి నదిలో నీటి ప్రవాహం పెరిగి కీళపట్టు మార్గంలోని లోతట్టు వంతెనపై నుంచి నది నీరు పారింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన నగరిపేట, టీఆర్ కండ్రిగ, ఇందిరమ్మ నివాసాల వద్ద, వినాయకనగర్, సాయినగర్ ప్రాంతాల్లో వర్షపు నీరు వీధుల్లో ప్రవహించింది. నగరిలో గురువారం సాయంత్రం వరకు 52.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. వరి, వేరుశెనగ, మొక్కజొన్న, మినుము, పెసర పంట భూముల్లో వర్షపు నీరు చేరింది. జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు సమీపం గల గుంట వర్షానికి నిండి పైకి పారడంతో బాలుర, బాలికల హాస్టల్ ప్రహరీ వరకు, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయానికి వెళ్లే మార్గమంతా జలమయమైంది. వర్షాలకు తడిచిన పంటలను కాపాడుకునే మార్గాలపై వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు అందించారు.



ఎస్ఆర్ పురం: మండలంలో బుధవారం గురువారం కురిసిన వర్షానికి చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్న సందర్భంగా రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లోకనాథ పిల్లై అన్నారు. ఆయన మాట్లాడుతూ... గతంలో కురిసిన వర్షానికి కారణంగా మండలంలోని పుల్లూరు పెద్దచెరువు, పద్మాపురం, ఆర్ఆర్ పురం, పాతపాలెం, జిఎంఆర్ పురంలో చెరువులు నుండి మొరవ పారుతున్నాయని తెలిపారు. అలాగే పాపిరెడ్డిపల్లి, పాతపాలెం, జిఎంఆర్ పురం, దిగువ కమ్మకండిగ, ఎగువ కమ్మకండిగా వాగుల్లో ఉధృతంగా నీరు ప్రవహించడంతో రాకపోకల అంతరాయం కలిగే అవకాశాలు కూడా ఉన్నాయన్న కారణంగా ప్రజలు రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నీట మునిగిన వేరుశనగ



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతుల కష్టం వానలపాలైంది. అప్పులు చేసి పండించిన పంట నీట మునిగిందని, పంట పెట్టుకున్న ఆశలు అడియాశలు అయ్యాయని మండలంలోని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. తరచూ తుపానుల వలన కురుస్తున్న వర్షాలకు రైతులు కష్టపడి సాగు చేసిన వరి, వేరుశనగ పంటలు నీటమునిగాయి. మండలంలోని మాంబేడు పంచాయతీ చిన్నమ్మరెడ్డి కండ్రికకు చెందిన రైతు శేఖర్‌కు చెందిన పంట పొలంలోని వేరుశనగ బుధవారం రాత్రి కురిసిన వానలకు పూర్తిగా నీట మునిగి చెరువును తలపిస్తోంది. గురువారం తెల్లవారు జామున రైతు తమ పొలాల్లో నీట మునిగిన పంటను చూసి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. అలాగే మండలంలోని ఆళ్లమడుగు సరిహద్దు రహదారి ప్రాంతంలో గాలీవానలకు విద్యుత్ స్తంభం నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

గురునాథం చెరువుకు గండి

మట్టితోలి పూడ్చిన గ్రామస్తులు, పంచాయతీ



సోమల: సోమల మండలం ఆవులపల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న గురునాథం చెరువు కట్ట వద్ద గండి ఏర్పడి ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండి చెరువులోని నీరు కట్టపై పొంగి పొర్లుతూ ఉండడంతో గుర్తించిన గ్రామస్తులు పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్లతో మన్ను తోలి జెసిబి సాయంతో చదును చేసి గండి పడకుండా మట్టి వేసి పూర్తి వేశారు. నంజంపేట నుండి పెద్ద ఉప్పర పల్లెకు వెళ్లే ప్రధాన రహదారి పై గురునాథ చెరువు కట్ట ఉండడంతో గ్రామస్తులు గుర్తించకుండా రాత్రి వేళల్లో గండిపడి ఉంటే మూడు పంచాయతీలకు రాకపోకలు ఆగిపోయి ఉండేవి. అయితే సకాలంలో గుర్తించి వెంటనే మట్టితోలి గండిని పూడ్చివేయడంతో అటు గ్రామస్తులు ఇటు వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

పేదల పొట్ట నింపుతున్న బెర్రకోట బొమ్మలు

- ఆకట్టుకుంటున్న కళాఖండాలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న టెర్రకోట బొమ్మలు

చిత్తూరు జిల్లా టెర్రకోట బొమ్మలు.. ప్రపంచ ప్రఖ్యాతినార్జిస్తూ మరోపక్క పేదలపొట్ట నింపుతున్నాయి. ఈ ప్రాంతంలో తయారయ్యే వివిధ రకాల కళాఖండాలు మట్టిలో మాణిక్యాలుగా ప్రజల మన్ననలు పొందుతున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన పలమనేరు హస్త కళాకారుల చేతుల నుండి జాలువారిన అద్భుతమైన బొమ్మలకు జీవం పోస్తున్న హస్త కళాకారుల కృషి వివిధ ప్రాంతాల్లో ఖ్యాతిని పొందుతున్నాయి.

ప్రజాశక్తి- వి కోట: గతంలో మట్టికుండలు ఇతర మట్టి వస్తువులు తయారుచేస్తూ చాలీచాలని ఆదాయాలతో బతుకుల్ని వెల్లదీసిన కళాకారులు నేడు ఆధునిక పోకడలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని మేలవించి అదే మట్టితో అద్భుతమైన కళాఖండాలను తయారు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం మారిన జీవనశైలితో ఇండ్లను ప్రతి ఒక్కరు టెర్రకోట బొమ్మలతో అలంకరించుకుంటూ ఆదరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని మదనపల్లి ప్రాంతం అంగళ్ళ, ఈడిగపల్లి, పలమనేరు, సదుం తదితర ప్రాంతాలు ఈ బొమ్మల తయారీకి ప్రసిద్ధి. ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తుండటంతో తయారుదారులు కూడా దూరప్రాంతాల్లో తయారైన అందమైన వివిధ కళాకృతులను తీసుకొచ్చి వాటికి రంగులద్ది విక్రయిస్తుంటారు. గతంలో దుర్భర జీవితాలు అనుభవించిన కుటుంబాలకు ప్రభుత్వం తోడ్పాటు అందించడంతో నేడు గౌరవప్రదమైన జీవనాన్ని అనుభవిస్తున్నారు. ఈ బొమ్మల తయారీకు అవసరమైన ప్రధాన ముడి సరుకు బంకమట్టి, ఇసుక తదితర పదార్థాలతో ఈ బొమ్మలను తయారు చేస్తారు. వందలాది రకాల ఆకృతులతో తయారవుతున్న దేవతా మూర్తులు, పూల కుండీలు, కూజాలు, వివిధ జంతువులు, గంటలు ఇంటిని సుందరంగా అలంకరించే అనేక ఆకృతలతో తయారు చేస్తూ అబ్బురు పరుస్తున్నాయి. ధరలు సామాన్యులకు కూడా అందుబాటులో ఉండటంతో మంచి ఆదరణకు దోహదపడుతోంది. పలమనేరు ప్రాంతంలో సుమారు 50 కుటుంబాలు ఇదే వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం వీరికి మరిన్ని ప్రోత్సాహకాలు అందించి టెర్రకోట బొమ్మలకు మరింత ప్రాముఖ్యతను సాధించే దిశగా ముందుకు తీసుకెళ్లాలని స్థానికులు కోరుతున్నారు.



బొమ్మలకు రంగులద్దుతున్న మహిళలు

పూర్వీకులు నుంచి ఇదే వృత్తిని కొనసాగిస్తున్నాం..

- కె.వెంకటరమణ, హస్త కళాకారుడు

మా పూర్వీకుల నుంచి మేము తరతరాలుగా ఇదే వృత్తిని కొనసాగిస్తున్నాం. దీనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. గతంలో కన్నా ప్రస్తుత పరిస్థితులు టెర్రకోట బొమ్మల తయారీదారులకు సంతృప్తినిస్తోంది. ప్రభుత్వం చేతి వృత్తులను ప్రోత్సహించే దిశగా మమ్మల్ని ప్రత్యేకంగా గుర్తించింది. టెర్రకోట బొమ్మలు తయారీదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి ప్రభుత్వపరంగా సబ్సిడీ రుణాలు మంజూరు చేసి మరింత ప్రోత్సాహం అందించాలి.



అడుగడుగునా అవమానం.. విధిలేక ఉద్యోగం..



ప్రజాశక్తి- చిత్తూరు టౌన్:

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిపై సర్వేల పేరుతో అధికారులు వేధింపులకు దిగుతున్నారు. ఒక సర్వే చేస్తుండగానే మరో సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేసి వాటికి కాలపరిమితి విధించడంతో ఊపిరి సలపని పరిస్థితిలో సచివాలయ సిబ్బంది మౌనంగా రోధిస్తున్నారు. వీరు చేస్తున్న సర్వేలు గతంలో వాలంటీర్లు చేసేవారు 50 ఇళ్లకు ఒక వాలంటీర్ సర్వే నిర్వహించేవారు అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సచివాలయ సిబ్బంది వారి రోజువారి విధులు నిర్వహిస్తూ సర్వేలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. సాధ్యాసాధ్యాలను పక్కనపెట్టి టార్గెట్లు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారు.

వాలంటీర్లు స్థానికులు కనుక వారికి పూర్తిస్థాయి అవగాహన ఉండేది. గ్రామ, వార్డు సిబ్బంది సరైన అవగాహన లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది వార్డు గ్రామవాసులు వారివారి పనులు, ఉద్యోగాల నిమిత్తం ఇల్లు వద్ద అందుబాటులో ఉండడం లేదు. వారి కోసం రోజుల తరబడి వారి ఇంటి చుట్టూ ప్రదర్శనలు చేయాల్సి వస్తోంది. కొంతమంది ఫోన్లు చేస్తే బయట ఉన్నామని చెబుతున్నారు. ఓటీపీల ద్వారా చేద్దామంటే ఓటీపీలో అవకతవకలు జరుగుతున్నాయని, తాము చెప్పమని ప్రజలు అంటున్నారు. ఇటు అధికారులు.. అటు లబ్ధిదారులు వీరితో బంతాట ఆడుకుంటున్నారు. సచివాలయంలో అడ్మిన్ సిబ్బందిని కోఆర్డినేట్ చేసుకుంటూ ఇంటి, కులాయి, ఇతర పన్నులు వసూలు చేయడం, బిఎల్ఓ డ్యూటీలు చేసుకుంటూ సర్వేలు చేయలేక మానసిక వేదనకు గురి అవుతున్నారు. ఇక ఎడ్యుకేషన్ సెక్రటరీకి కార్యాలయం వదిలి కదిలే పరిస్థితి లేనివిధంగా పనులు ఉన్నాయి. ఆధార్, క్యాస్ట్, ఇన్కమ్, ఇంటి పన్నులు, ఇలా మీసేవ పనులన్నీ చేస్తు ఆ వార్డులోని విద్యాలయాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ఇవి చేస్తూనే సర్వేలు కూడా చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఈపరిస్థితుల్లో ఈ సెక్రటరీ వేదన అరణ్య రోదనే.

ఇక హెల్త్ సెక్రటరీ ఆరోగ్యంపై ఎప్పటి కప్పుడు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, వ్యాక్సిన్లు వేస్తూ వాటికి సంబంధించిన రికార్డులను మెయింటైన్ చేస్తూ. పోషక లోపం పిల్లలకు, గర్భవతులకు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇస్తూ. గర్భవతులు డెలివరీ అయ్యే వరకు మానిటరింగ్ చేస్తూ ఈ విధుల్లో తలమునకులైన వీరిని ఇతర సర్వేల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారు. ఎన్సీడీసీ సర్వే చేయాలంటే ఒక ఇంటి వద్దనే 20 నిమిషాలకు పైనే పడుతుంది. వారి రోజువారి ఆహారపు అలవాట్లు, ఆహారంలో వాడే నూనెలు, వారు తీసుకునే మాంసం అన్ని పరిశీలించి వారి బరువు ఎత్తులను కొలిచి నోట్ చేసుకోవాలంటే నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. ఇంటి యజమానుల వద్ద చివాట్లు తినాల్సిన పరిస్థితులు దాపురించడంతో వీరు మానసిక వేదనకు గురి అవుతున్నారు. ఇక డబ్ల్యుఎంఎస్‌కే అర్థం కాని ఒక వ్యర్థ ఉద్యోగిగా అడుగడుగునా అవమానిస్తూనే అన్ని పనులకు వాడుకుంటున్నారు. డబ్ల్యూఎంఎస్‌కేలు మేము ఏ ప్రభుత్వ శాఖకు చెందినవాళ్లం.. సెలవివ్వండి మహాప్రభో.. అని వేడుకొనే పరిస్థితి ఏర్పడింది. వీరికంటూ ఒక జాబ్ చాట్ సక్రమంగా లేదు.. గత ప్రభుత్వం సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలు, మహిళలపై జరిగే వివిధ అఘాత్యాలపై అవగాహన కల్పించే విధులతో పాటు, ఐసిడిఎస్ అంగన్వాడీలు విసిట్ చేయడం. విద్యాలయాల్లో కళాశాలలో విద్యార్థులకు క్రైమ్స్‌పై అవగాహన కల్పించడం వీరి ముఖ్య విధులుగా ఉండేవి. ప్రస్తుతం వీరికి జియో మ్యాపింగ్, బిఎల్ఓ విధులు, నైపుణ్య సర్వేలు మొదలైన సర్వేలతో వీరిపై వేధింపుల పర్వం సాగుతోంది. జీతం ఇచ్చేది మేము, మేము చెప్పిన పనులు చేయండి అని కార్పొరేషన్ అధికారులు సిబ్బంది వీరిని బెదిరింపులు గురి చేస్తుంటే. మీరు వైపు హోంశాఖకు చెందినవారు మీ సర్వీస్ రిజిస్టర్ మా వద్ద ఉంది మేము చెప్పిందే చేయాలని పోలీసు శాఖ హుకుం జారీ చేస్తున్నారు. ఇక రెవెన్యూ శాఖ బిఎల్ఓ విధులు చేయాలని ఆదివారాలు సెలవు దినాల్లోనూ విధులు వేసి నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీరు అన్ని శాఖలకు సేవలు అందిస్తున్నా డబ్ల్యూఎంఎస్‌కేలు వృథాగా జీతం తీసుకుంటున్నారు. వీరికి ఏం పని లేదని, ఖాళీగా జీతం తీసుకుంటున్నారని అధికారుల నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అవహేళన చేస్తూ వీరిని అవమానపరుస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వేలు ప్రజాశ్రేయస్సుకే అయిన సాధ్యాసాధ్యాలను చూసుకొని కాలపరిమితి విధించకుండా సిబ్బందికి సహకరించి టార్గెట్లతో వేధించడం, మెమోలు ఇచ్చి మానసికంగా వేదనకు గురి చేయకుండా, ప్రభుత్వ అధికారులు వారికి సహకరించాలని వేడుకుంటున్నారు.

గ్రామాల అనుసంధానానికి నిధులు కోరిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఎంజిఎన్ ఆర్ఈజిఎస్ ఓవరం అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. వెలగపూడిలో ఈనెల 11, 12 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో రెండో రోజు గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలు, ఐటి, ఇండస్ట్రీస్ అండ్ ఇన్వెస్ట్మెంట్స్, విద్యుత్ మానవవనరులు, ట్రాన్స్పోర్ట్, రోడ్డు, భవనాలు, హౌసింగ్, హెల్త్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా సంక్షేమం, రెవెన్యూ, ఎక్సైజ్, మైన్స్, డిస్టిక్ డెవలప్మెంట్ ప్లాన్స్ వంటి వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్షించారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సమీక్షలో భాగంగా గ్రామాల అనుసంధానం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నరేగా నిధుల నుండి ప్రతి గ్రామ పంచాయతీకి రూ.9 కోట్లు ఖర్చు చేయడానికి అనుమతించిందని, ఈ నిధులను అవసరం మేరకు రహదారులపై గుంతలు పూడ్చడానికి వినియోగించు కునే అవకాశం ఇవ్వాలని మరియు డ్రైనేజీ ల కొరకు లక్ష రూపాయలు మంజూరుకు మాత్రమే అవకాశం ఉందని వీటితో పాటు అంగన్వాడీ భవనాలు, కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణాలకు, మరమ్మతులకు నిధుల కేటాయింపులు చేయవలసి ఉందన్నారు. అలాగే చెక్ డ్యాంల నిర్మాణం, మరమ్మతులకు రూ.40లక్షల వరకు నరేగా నిధులను వినియోగించుకోగలమని, క్షేత్రస్థాయిలో నిధులు సరిపోవడం లేదని, పెద్ద పరిమాణంలోని చెరువులకు సంబంధించి చెక్ డ్యాంల నిర్మాణాలకు కోటి రూపాయలు నిధుల కేటాయింపు చేయవలసి ఉందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్యమంత్రిని కోరారు.



కలెక్టర్ల సదస్సులో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

అంగన్వాడీలకు వెంటనే వేతనాలు ఇవ్వాలి

యూనియన్ గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్



చిత్తూరు జిల్లాలో అంగన్వాడీలకు వేతనాలు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే విడుదల చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబానికి జీవనం గడుపుతున్నారని వారికి ఇచ్చేదే అంతంత మాత్రం అది కూడా నెలనెలా సక్రమంగా ఇవ్వకపోతే వారెలా జీవించాలని ప్రశ్నించారు. ఇప్పటికే అప్పులు చేసి రకరకాల ప్రభుత్వ కార్యక్రమాలకు ఖర్చు పెట్టినారు. ఆ బిల్లు ఇంత వరకు రాలేదు. అత్యధికులు జీతంతోనే ఆధారపడి పనిచేస్తున్నారని ప్రభుత్వ చిరుద్యోగులైన స్కీం వర్కర్లకు వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం 42 రోజులు సమ్మె చేసి గత ప్రభుత్వం మెడలు వచ్చిందని గుర్తు చేశారు. సమ్మె చేసి సంవత్సరం అవుతున్న సందర్భంగా జిల్లా కలెక్టర్‌కి ప్రాజెక్టు డైరెక్టర్‌కి సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర సమస్యలతో పాటు జిల్లాలో కొన్ని ప్రాజెక్టులో అనేక రకాల సమస్యలు ఉన్నాయని జిల్లా సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

మండల పరిధిలోని అటవీ సరిహద్దు ప్రాంతాలైన వెంగంవారిపల్లి, కడపట్లపల్లి, కలిగుట్ట గ్రామాలలో ఒంటరి ఏనుగు పంట పొలాలపై దాడి చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు వెంగంవారిపల్లి గ్రామానికి చెందిన ఆర్.రవిచంద్రబాబుకు చెందిన 9 మామిడి చెట్లను, రెండు టెంకాయ చెట్లను విరిచేసింది. ఈ సంఘటనలో రైతుకు రూ.75వేలు నష్టం కలిగింది. రెండు రోజుల ముందు ఇదేవిధంగా ఒంటరి ఏనుగు కడతట్లపల్లి గ్రామానికి చెందిన రైతులు బత్యప్ప, శ్రీరాములుకు చెందిన బంగాళాదుంప పంటను నష్టపరిచినట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులు నిత్యం గ్రామాల్లోని పంటలపై దాడి చేసి నష్టపరుస్తున్నాయని ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



మామిడి, టెంకాయ చెట్లను నష్టపోయిన రైతు రవిచంద్రబాబు

నీవా నది దిగువ ప్రాంతాలను పరిశీలించిన ఎంఎల్‌ఏ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నీవా నదిలో నీటి ప్రవాహ పరిస్థితిని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పరిశీలించారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే నగరపాలక అధికారులతో కలిసి తేనబండ, లిల్లీబ్రిడ్జి ప్రాంతాల్లో పర్యటించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా గురువారం ఉదయం నుంచి భారీగా వర్షం కురుస్తోంది. ఈ పరిస్థితుల్లో నీవానదిలో నీటి ప్రవాహం మొదలవడంతో పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయడం, అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయడంపై ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. తేనెబండ వద్ద నీవానదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. నదిలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, ప్రవాహ పరిస్థితిని అంచనా వేసుకుంటూ స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. నదిలో పసుపు, కుంకుమ, పూలు చల్లి పూజలు చేశారు. వర్షాలు ఇలానే కొనసాగితే నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాకాలం ఆరంభంలోనే ముందస్తుగా నదిలో పూడిక తొలగించి శుభ్రం చేసిన కారణంగా నీటిమట్టం పెరిగిన స్థానిక నివాసాలకు ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. సంతపేట వద్ద లిల్లీవంతెన పరిశీలించారు. ఇన్చార్జి కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



నీవానది వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఏ గురజాల

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి- శాంతిపురం: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శాంతిపురం ఎంపిడిఒ ఏపీఆర్ కుమార్ అధ్యక్షతన డ్వామా ఏపీడీ మల్లికార్జున్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. మండలంలో 2023-24 గానూ ఉపాధి హామీ చట్టంతో పాటు పలు సంక్షేమ పథకాల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలు పంచాయతీలకు చెందిన క్షేత్ర సహాయకులు నిర్వహించిన పనులపై తనిఖీ బృందం క్షేత్రస్థాయి పనులపై మండలస్థాయిలో ప్రజావేదిక సభ నిర్వహించి సామాజిక తనిఖీపై గ్రామాలవారీగా నివేదికలను ప్రజాప్రతినిధుల సమక్షంలో చదివి వినిపించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1384 వివిధ రకాల పనులుగాను రూ.6.78 కోట్లు ఖర్చు చేశారు. సామాజిక తనిఖీ సిబ్బంది గుర్తించిన అంశాలలో మామిడి మొక్కలు చనిపోయిన వివరాలు తెలియజేసి రైతులకు నాటుకోవాలని చెప్పారు. అదనంగా చెల్లించిన వేతనాలు, ఒక పనికి అదనంగా మెటీరియల్ డబ్బులను తిరిగి రికవరీ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. చిన్నారిదొడ్డి పంచాయతీలో 183323 రూపాయలు, కర్లగట్ట పంచాయతీలో 140494 రూపాయలు, నడింపల్లి పంచాయతీలో 97వేలు, మఠం పంచాయతీలో 89 వేలు, మఠం పంచాయతీలో 58 వేలు ఇలా 23 పంచాయతీలలో మొత్తంగా 880311 రూపాయలు రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో హరి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది రైతులు ప్రజలు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన కల్పించాలి



ప్రజాశక్తి- యాదమరి: గర్భవతులు గర్భస్థ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ప్రభుత్వం వారికి ఫోన్ ద్వారా సమాచారాన్ని ఇస్తుందని దీనిపై ఆశా వర్కర్లు అవగాహన కలిగి ఉండాలని యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిహెచ్ఓ లక్ష్మీనారాయణ తెలిపారు. దీనిపై గురువారం స్థానిక పిహెచ్‌సిలో అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ ఇంచార్జ్ కీర్తి మాట్లాడుతూ ఒక వివాహిత గర్భం దాల్చిన నాటి నుండి ప్రసవం అయ్యేంత వరకు ఈ కిల్కారి సందేశం ఫలుదపాలు వారికి అందించాల్సి ఉంటుందన్నారు. గర్భవతి మొబైల్ నెంబర్ డేటాలో అప్డేట్ చేస్తే ఎలాంటి సమస్య రాకుండా వారికి అందించాల్సిన సమాచారం నేరుగా అందించవచ్చు అని దీని వలన గర్భస్థ సమయంలో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారికి అర్థమయ్యేలా వివరించ వచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సెల్వరాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా జైన్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకుని జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆత్మన్ జైన్, మేనేజర్ షమీర్ శర్మ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: జైన్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకులు డాక్టర్ పద్మభూషణ్ భావర్ లాల్ జైన్ 87వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఈ వేడుకల్లో భాగంగా భావర్ లాల్ జైన్ మనవడు ఆత్మన్ జైన్ ఆధ్వర్యంలో భజనలు నిర్వహించి ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. జైన్ కంపెనీ మేనేజర్ సమీర్ శర్మతో కలిసి ఆత్మన్ లాల్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంపెనీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు చిత్తూరుకు చెందిన విన్ హెల్త్ హాస్పిటల్ వారిచే వైద్యశిబిరం నిర్వహించారు. ప్రొడక్షన్ మేనేజర్ అశోక్ విశ్వకర్మ, భావతే, మంగేష్, కార్మికులు పాల్గొన్నారు.

మామిడి రైతులు పంటల బీమా చేసుకోవాలి

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: మామిడి రైతులు ఈనెల 15లోపు వాతావరణ ఆధారిత పంటల బీమా చేసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి పి.శివకుమారి రైతులకు సూచించారు. కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం కలిగి ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమీ పథకాన్ని రబీ సీజన్‌లో అమలు చేస్తున్నామన్నారు. ఎకరాకు 35వేలు బీమా పొందేందుకు రూ.1750 ప్రీమియంను చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు.

మిరప రైతులకు సూచనలు

బిఎన్ కండ్రిగ : వర్షాలకు మిరప తోటల్లో నీరు నిలబడి ఉంటే వెంటనే బయటకు పంపాలని అగ్రికల్చర్ అధికారి యామిని సూచించారు. వెంటనే కాపర్ ఆక్సిజన్ క్లోరైడ్ (బ్లీటాక్స్) లేదా రిడామిల్ ఎంజెడ్ 3 గ్రామ్స్ ఒక లీటర్ నీటికి కలిపి కాండము, వేరు, మొదళ్లు మొక్క అంత బాగా తడిచేలా స్ప్రే చేయాలన్నారు. రెండు రోజులు తరువాత, 19:19:19ఏ 2-3 గ్రాం ఒక లీటర్ నీటికి ఆగ్రోమిన్ మాక్స్ ఏ 2 గ్రామ ఒక లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలన్నారు.

బాలికల భవిష్యత్తుకు కిశోరి వికాసం



ప్రజాశక్తి- పూతలపట్టు: మండలంలోని అధికారులంతా కలిసికట్టుగా బాల్యవివాహాలను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, వైద్యశాఖ అధికారులు, ఐసిడిఎస్ సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడీ సిబ్బంది బాల్యవివాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, బాల్య వివాహాలు జరుగుతున్న విషయాలు తమ దృష్టికి వచ్చిన వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. బాల్యవివాహాల వలన వచ్చే అనర్థాలను ఆయన క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ మధు, సీఐ కృష్ణమోహన్, అధికారులు పాల్గొన్నారు.

యాదమరి: బాల్య వివాహాలను అరికట్టాలని మండల అభివృద్ధి అధికారి వేణు కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కిషోరి వికాసం మండలస్థాయి ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్, ఏఎన్ఎం, జిఎంఎస్‌కె, ఆశాలకు పీహెచ్సీ డాక్టర్ శివకుమార్ అవగాహన కల్పించారు. తహశీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, విద్యాశాఖ అధికారి రుక్మిణి, మాదిరెడ్డిపల్లి పీహెచ్సీ డాక్టర్లు శివకుమార్, వరప్రసాద్ ఎంపిహెచ్ఈఓ మునీంద్ర రాజు, ఏఎస్ఐ దామోదర్ రెడ్డి, డిఎల్ఓ వెంకటేష్, సిహెచ్ఓ లక్ష్మీనారాయణ, ఈవోపీఆర్డి సుకుమార్ రెడ్డి, పిహెచ్ఎన్ ఈశ్వరమ్మ, ఎంపీహెచ్ఎస్ విజయలక్ష్మి, లక్ష్మీపతి ఐసిడిఎస్ సూపర్వైజర్లు లలితమ్మ, కవిత, సరళ కుమారి పాల్గొన్నారు.

చౌడేపల్లి: మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోరి వికాసం పై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అమర జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు మధ్య గల కిషోరీ బాలికలకు గ్రామస్థాయిలో ఏవిధంగా రక్షణ కల్పిస్తామన్న అంశంపై ఎస్సై నాగేశ్వరరావు వివరించారు. అదేవిధంగా ఫోక్సో, చైల్డ్ హెల్ప్‌లైన్, అమ్మాయిలపై అఘాయిత్యాలు గురించి తెలియజేశారు. డాక్టర్ పవన్ కుమార్ పౌష్టికాహారం గురించి, బాలికల్లో వచ్చే అనీమియా ఆరోగ్యం పరిశుభ్రత గురించి తెలియజేశారు. వెలుగు ఏపిఎం సుబ్రహ్మణ్యం స్కిల్ డెవలప్మెంట్ పై అవగాహన కల్పించారు. ఎంఈఓ కేశవరెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని అరికట్టాల్సిన అవసరం అందరిపై ఉందని అన్నారు. ఏవో షబ్బీర్ అహ్మద్, పిహెచ్ఎన్ కృష్ణవేణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రమాదేవి, సులోచనలు పాల్గొన్నారు.

గుడిపల్లి: బాలికల బంగారు భవిష్యత్తుకు కిషోరి వికాసం కార్యక్రమం పునాది వేస్తుందని, ఉజ్వల ఆరోగ్యకరమైన సాధికారత దిశగా వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూత అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తహశీల్దార్ సీతారం అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసిడిఎస్ పర్యవేక్షణలో సచివాలయ స్థాయి అధికారులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రాధాకృష్ణ, ఈవోపిఆర్డి సద్గుణ, ఏపీఎం, మహిళా పోలీసులు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



సదుం : ఐసిడిఎస్ సూపర్వైజర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో గురువారం కిశోరి వికాసం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించారు. మండల తహశీల్దారు మారుఫ్ హుసేన్, ఎంపీడీవో జి.రాజశేఖర్ బాబు, సదుం ఎస్సై షేక్‌షావలి, చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరీష, ఎంఈఓ 2 దామోదర్ ఈసమావేశానికి హాజరయ్యారు.

కార్వేటినగరం: మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మహిళలకు శిశు సంక్షేమ శాఖవారి ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమంపై శిక్షణా తరగతులు సిడిపిఓ పద్మ సునంద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో చంద్రమౌళి, ఈవో పిఆర్డి నాగరత్నమ్మ, పర్యవేక్షకులు ఇందిరా, శామిని, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు కూటమి పార్టీల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను గుర్తు చేస్తూ కూటమి ప్రభుత్వ ఆరు నెలల విజయాలను వివరిస్తూ శుక్రవారం జిల్లా టిడిపి కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న చిత్తూరు ఎంఎల్ఏ గురుజాల జగన్‌మోహన్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. ఐదేళ్లపాటు వ్యవస్థలను నాశనం చేస్తూ అభివృద్ధిని మరచి అరాచక పాలన సాగించిన.. వైనాన్ని మర్చిపోయి ప్రజలు ఇప్పుడిప్పుడే కూటమి ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను అనుకుంటున్నారు. గడిచిన ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, తిరిగి పట్టాలెక్కించిందని, రైతులకు వెన్ను దన్నుగా నిలిచిందని తెలిపారు. ఆరు నెలల్లో చేపట్టిన విజయాలను గుర్తు చేస్తూ శుక్రవారం కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ర్యాలీకి రైతన్నలు తెదేపా, జనసేన, బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతి


ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చిత్తూరు జిల్లా వైసిపి ఆధ్వర్యంలో జిల్లాలోని చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు, కుప్పం, గంగాధర్ నెల్లూరు నియోజకవర్గాల వైసీపీ నేతలు అందరూ కలిసి రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంపి.విజయానందరెడ్డి పేర్కొన్నారు.

ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి

ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని ముష్టిపల్లిలో గ్రామంలో నివాస వసతిలేని ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. గ్రామాన్ని సందర్శించిన ఆయన వర్షాలు అధికంగా కురుస్తున్నందున పక్కా భవనాల వద్ద మాత్రమే నివాసం ఉండాలని తెలిపారు. గ్రామంలో గత రెండేళ్లుగా రిపేర్‌లో ఉన్న బోరుబావిని పరిశీలించారు. వీలైనంత త్వరాగా మరమ్మతులు చేయించి తాగు నీటిని అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ ఉన్నారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే మురళీమోహన్



ప్రజాశక్తి- యాదమరి: మండలంలోని కోనాపలె గ్రామానికి చెందిన మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ, ఆందోని దంపతుల కుమారుడు రబ్బీ తామరకన్ను వివాహ వేడుకలో పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గురువారం రాత్రి చిత్తూరు సంతపేటలో గల ఆర్ఆర్.గార్డెన్‌లో జరిగిన తామరకన్ను. సుష్మితాల వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చూడ చైర్‌పర్సన్ కఠారి అనురాధ, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, యాదమరి ఎంపీపీ సురేష్, టిడిపి అధ్యక్షులు మొరార్సి, తహశీల్దార్ పార్థసారథి, డిప్యూటీ తహశీల్దార్ జయంతి, ఆర్ఐ ప్రసాద్, ఎంపీడీవో వేణు, అధికారులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండలంలో శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా మండలంలోని పలు ఎలక్షన్ బూత్‌లను ఇరిగేషన్ ఏఈ రవినాయక్, ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని పుల్లూరు పెద్ద చెరువు, ఆరిమాకుల కోనచెరువు, పిల్లారి కుప్పం చెరువు మూలూరు చెరువు ముద్దికుప్పం చెరువులను పరిశీలించారు.

రోడ్డు విస్తరణకు ముందుకొచ్చిన షాషపీరన్ మసీదు కమిటీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు హై రోడ్డు విస్తరణ పనులకు నగరపాలక సంస్థ పూర్తి సహకారం తెలుపుతూ వక్ఫ్ బోర్డు ద్వారా ఎన్వోసీని షాషపీరన్ మసీదు కమిటీ సమర్పించింది. చిత్తూరు నగర మాస్టర్ ప్లాన్‌లో భాగంగా హై రోడ్డు విస్తరణ, జిల్లా కోర్టు ప్రాంగణం నుండి ఎమ్మెస్సార్ జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపున 30 మీటర్లు (55 అడుగులు) నగరపాలక సంస్థ అధికారులు తొలగించనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని భవనాలకు మార్కింగ్‌లు ఇచ్చారు. చిత్తూరు హై రోడ్డులో వక్ఫ్ బోర్డు సర్వే స్థలం ఉంది. ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ రోడ్డు విస్తరణలో నగర అభివృద్ధి పిలుపుమేరకు తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగ నాయకులు మసీదు కమిటీ వారిని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులను, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులతో చర్చించి వక్ఫ్ బోర్డు స్థలం నగర అభివృద్ధికి, రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని కోరగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ యాక్ట్, 1995 సెక్షన్ 51 ప్రకారం ప్రజల సౌకర్యార్థం వక్ఫ్‌బోర్డు స్థలాన్ని రోడ్డు విస్తరణ కొరకు ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. నష్టపరిహారాన్ని రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ సీఈవో ఖాతాలో జమ చేయాలని వక్ఫ్ బోర్డు అధికారులు నగర పాలక సంస్థ కమిషనర్‌కు లేఖను అందజేశారు. షాషపీరన్ మసీదు కమిటీ కార్యదర్శి యం.అఫ్జల్ ఖాన్ వక్ఫ్ అధికారులు ఇచ్చిన అనుమతి లేఖను, రోడ్డు విస్తరణకు పూర్తి సహకారం తెలుపుతూ నగరపాలక సంస్థ అధికారులకు టిడిపి నాయకుల ద్వారా గురువారం సమర్పించారు. ఎన్ఓసి అందుకున్న వారిలో టిడిపి నగర మైనార్టీ నాయకులు ఫిరోజ్ భాయ్, అత్తర్ బాష, ఏ అతు భాయ్, అన్సర్ భాయ్, జిలాని, మున్నా భాయ్, రఫీ, మూస తదితరులు పాల్గొన్నారు.



లేఖను అందిస్తున్న మైనార్టీ నాయకులు

భూ సమస్యలపై వినతుల వెల్లువ




ప్రజాశక్తి- చౌడేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ యువ నేత మాదిరాజు ప్రదీప్‌రాజు కోరారు. గురువారం మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ బాలసముద్రంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మాధవి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ భారతి, మండల సర్వేయర్ గుణశేఖర్, సర్పంచ్ కదిరప్ప పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మూలతిమ్మేపల్లి గ్రామంలో తహశీల్దార్ మాధవ రాజు అధ్యక్షతన గురువారం రెవెన్యూ సద్నును నిర్వహించారు. ఈ సదస్సులో భూ సమస్యలపై ప్రజల నుండి 16 వినతులు అందినట్లు తహశీల్దార్ తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారి రమణ, ఎంఆర్ఐ సరిత, వీఆర్ఏ పద్మావతి, ప్రజలు పాల్గొన్నారు

కుప్పం రూరల్ : కుప్పం మండలం కందుంది గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని మండల తహశీల్దార్ చిట్టిబాబు నిర్వహించారు. కార్యమ్రకానికి ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం హాజరై మాట్లాడారు. ఈ రెవెన్యూ సదస్సు జనవరి 8 వరకు కొనసాగుతుందని రెవెన్యూ సమస్యలున్న వారు రెవెన్యూ సదస్సులో తెలపాలని రైతులకు ఆయన సూచించారు.

సోమల: మండలం అన్నెమ్మగారిపల్లి పంచాయతీలో రెవెన్యూ సదస్సును గురువారం తహసిల్దార్ బెన్ను రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదస్సులో పలు సమస్యలపై 27 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. అన్ని అర్జీలను పరిశీలించి ఆన్లైన్ చేసి పరిష్కరిస్తామని తెలిపారు.



కుప్పంలో ఏపిఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం

తిరుమలలో అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల మాడవీధుల విస్తరణలో భాగంగా కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, లేనిపక్షంలో ఫిబ్రవరి 22న ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని మంగళం అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి స్పష్టం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, తొలగించిన హనుమంతుని విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్టించాలని కోరుతూ పుణ్యక్షేత్రాలు తిరిగి భక్తుల సంతకాలు సేకరించి టిటిడికి సమర్పించామన్నారు. అన్నమయ్య గహ సాధన సమితి, జై భారత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ డిమాండ్లపై పోరాడుతున్నామన్నారు. టిటిడి అనుబంధ ఆలయాల్లో నిత్య హరినామ సంకీర్తన జరగాలని అప్పుడే పూర్తిస్థాయిలో తిరుమల పుణ్యక్షేత్రం ప్రక్షాళన అవుతుందన్నారు. భక్తి గీతాలు నేర్పించే గురువులకు టిటిడి గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జై భారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి యోధ లోకనాథ్, ఖదిజ్ఞాసి మల్లికావల్లభ, ఖదిజ్ఞాసి మహేష్ పాల్గొన్నారు.



క్రైం న్యూస్

గుర్తు తెలియని శవం లభ్యం



డ్యామ్ కింద గుర్తు తెలియని వ్యక్తి శవం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని మంగినాయని కుప్పం బస్టాప్ సమీపంలోని రోడ్డు డ్యామ్ కింద గురువారం గుర్తు తెలియని శవాన్ని స్థానికులు గుర్తించారు. సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తూగుండ్రం ప్రధాన రహదారి పక్కన మంగినాయనికుప్పం బస్టాప్ దగ్గరలోని డ్యామ్ కింద గుర్తు తెలీని వ్యక్తి శవం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటన స్థలాన్ని సీఐ పరిశీలించి శవాన్ని బయటకు తీయించారు. సదరు మృతునికి సుమారుగా 40 నుంచి 45 మధ్య వయసు ఉంటుందన్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్

వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన శేషాద్రి

ప్రజాశక్తి- సోమల: ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారులు సంఘటనా స్థలంలోనే మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కందూరు - నిమ్మనపల్లి మార్గమధ్యంలోని స్వర్ణకుమారి మామిడి తోపు వద్ద గురువారం మదనపల్లి నుండి నిమ్మనపల్లి మీదుగా కందూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును కందూరు నుండి ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళ్తూ బస్సును ఢీకొనడంతో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న నిమ్మనపల్లి మండలం బండ్లపై గ్రామానికి చెందిన శేషాద్రి (30) అక్కడికక్కడే మృతిచెందగా ద్విచక్ర వాహనంలో వెనుక వైపు కూర్చుని ఉన్న గురునాథ్ అను అతనికి స్వల్ప గాయాలైనట్టు ఎస్సై తెలిపారు. ద్విచక్ర వాహనంపై అతివేగంగా నిర్లక్ష్యంగా వెళ్లి ఆర్టీసీ బస్సును ఢీకొనడం, తలకు హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్ర గాయమై శేషాద్రి అక్కడికక్కడే చనిపోయాడని తెలిపారు. గురునాథ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

తండ్రి మందలించారని

విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- కార్వేటినగరం: 10వ తరగతి చదువుతున్న బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక కుటుంబసభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కత్తెరపల్లి కాలనికి చెందిన 10 తరగతి చదివే ఓ విద్యార్థి తరచూ తలనొప్పి అంటూ పాఠశాలకు రాకుండా నిత్యం ఇంటికి వెళ్లిపోయే వాడు. బుధవారం ఆ బాలుడి తండ్రి సరిగ్గా చదవడం లేదని మందలించి కూలీ పని కోసం ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థి ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న తల్లిదండ్రులకు కొడుకు శవమై వేలాడుతూ కనిపించాడు. ఈవిషయమై ఎస్ఐ రాజ్ కుమార్‌ను వివరణ కోరగా వారి నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రూ.5లక్షలు నగదు చోరీ

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణం కొత్తపేట జయప్రకాష్ రోడ్డులోని తమ ఇంటిలో ఉంచి నగదు చోరీకి గురైనట్లు ఆయుబ్ కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుత్తార్లపల్లి గ్రామ సమీపంలోని క్వారీలో 30 మంది కూలీల చేత రాతి పనులు చేయిస్తూ మేస్త్రిగా వ్యవహరిస్తున్న ఆయుబ్ తన వద్ద పనిచేస్తున్న వారి జీతభత్యాల నిమిత్తం రూ.5లక్షలను ఇంటిలో ఉంచినట్టు తెలిపారు. గురువారం ఉదయం యథావిధి తను పనికి వెళ్లిపోగా, తన తమ్ముడు పాఠశాలకు వెళ్లాడని, ఈ సమయంలో తల్లి తమ ఇంటి సమీపంలోని తలవాయు కొత్తపల్లి ప్రాంతంలో బంధువుల ఇంటికి వెళ్లిందని ఇంటిలో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపును, బీరువా లాకరును పగలగొట్టి అందులో ఉంచిన ఐదు లక్షల రూపాయల నగదును కాజేసినట్టు తెలిపారు. కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

ఇంటికి చేరిన దీక్ష మృతదేహం



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని కొత్తఇండ్లు గ్రామానికి చెందిన బుజ్జి కుమార్తె దీక్ష (13) కర్ణాటకలోని కోలారు జిల్లా ముళబాగిల్ తాలూకా కొత్తూరు గ్రామంలోని మొరార్జీ దేశాయి స్కూల్‌లో ఉంటూ 9వ తగరగతి చదువుతోంది. బుధవారం పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మురడేశ్వరంకు టూర్ వెళ్లారు. విద్యార్థులు సముద్ర తీరంలో ఆడుకుంటూ ఉండగా 12 మంది విద్యార్థులు సముద్రపు అలల్లో చిక్కుకున్నారు. వీరిలో దీక్ష మృతిచెందింది. దీక్ష మృతదేహాన్ని గురువారం ఉదయం సొంత గ్రామమైన కొత్తఇండ్లుకు తీసుకొచ్చారు. దీక్ష మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

ఉడాయించిన ప్రైవేట్ బస్సు డ్రైవర్

రోడ్డున పడ్డ అయ్యప్ప భక్తులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అయ్యప్ప స్వామి మాలతో యాత్రకు వచ్చిన 35 మంది భక్తులను నడిరోడ్డుపై వదిలేసి కావేరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ఉడాయించిన ఘటన గురువారం ఉదయం తిరుపతిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గుంటూరుకు చెందిన 35 మంది కావేరి ట్రావెల్స్ ద్వారా అయ్యప్ప మాలతో యాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తిరుపతికి చేరుకుని, బస్సును అలిపిరి లింకు బస్టాండ్ వద్ద ఉంచి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. స్వామి దర్శనానంతరం అయ్యప్ప భక్తులు రావడానికి ఆలస్యం కావడంతో, తిరుపతి లింకు బస్టాండ్ వద్ద ఉన్న ట్రావెల్స్ బస్సు డ్రైవర్, క్లీనర్ అయ్యప్ప భక్తుల లగేజ్‌ని రోడ్డుపై వదిలేసి, బస్సును



తీసుకొని వెళ్ళిపోయారు. తిరుపతికి చేరుకున్న భక్తులు అక్కడ బస్సు లేకపోవడంతో డ్రైవర్ను ఫోన్లో సంప్రదించారు. మీకు ఇచ్చిన సమయం అయిపోయిందని, అందుకే వెళ్ళిపోతున్నానని బస్ డ్రైవర్ సమాధానం ఇవ్వడంతో విధి లేని పరిస్థితుల్లో తమకు న్యాయం చేయాలని డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పోలీసులు ట్రావెల్స్ బస్సు కోసం గాలింపులు చేపట్టారు, బస్సు నెల్లూరు చెక్‌పోస్టు వద్ద వెళ్తుండడంతో, చెక్ పోస్ట్ సిబ్బందితో సంప్రదించి బస్సును అక్కడే ఆపారు. బస్ డ్రైవర్ బస్సును తిరుపతికి తీసుకువచ్చేందుకు ససేమిరా అనడంతో, పోలీసుల సహాయంతో భక్తులు అవస్థ పడుతూ నెల్లూరుకు చేరుకుని అదే బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. పోలీసులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయడంతో భక్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన హ్యాకథాన్-2024 పోటీలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శాస్త్ర సాంకేతికను ఉపయోగించి ఆరోగ్య రంగంలో ఎదురవుతున్న సవాళ్ళను అధిగమించడమే లక్ష్యంగా స్థానిక తిరుపతి ఐఐటీలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 పోటీలు గురువారం ముగిశాయి. దేశవ్యాప్తంగా 52 నోడల్ కేంద్రాల నుంచి 1300 మంది విద్యార్థులు హ్యాకథాన్ పోటీలకు హాజరు కాగా నాలుగు టీమ్ లు విజేతలుగా నిలిచాయి. ఒక్కో టీమ్ రూ.లక్ష .చొప్పున బహుమానం అందుకుంది. టీమ్ లీడర్ సుస్మిత నేతత్వంలోని 'స్టాక్ స్క్వాడ్', శ్వేత నేతత్వంలోని 'ప్రగతిమిత్ర', కార్తీక్ నేతత్వంలోని 'కోడ్ క్రాఫ్ట్', కౌసల్ వ్యాస్ నేతత్వంలోని 'సాహ్వాడం' టీమ్ లు ఆరోగ్య రంగానికి అవసరమైన సరికొత్త ఆవిష్కరణలు చేసి విజేతలుగా నిలిచారు. వీరికి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ బహుమతులు ప్రదానం చేశారు.